కార్టూన్ కథలు

మాంత్రికుడు

ఒకసారి మా స్కూలుకు ఒక మాంత్రికుడు వచ్చాడు. అందరూ టిక్కెట్టు కొనుక్కుని లోపలికి వచ్చారు. మాంత్రికుడు తన విద్యలన్నీ చూపించి చివరికి టోపీక్రిందవున్న ఉంగరాన్ని, దేన్నీ ముట్టుకోకుండా బయటికి తీసే వాళ్లకి రు 116 లు బహుమానమన్నాడు మాంత్రికుడు. ఎవరూ ముందుకు రాలేదు. మాంత్రికుడు ఒక బల్లమీద నల్లనిబట్టను పరచి దానిమీద ఒక ఉంగరంపెట్టి, దానిపైన ఒక దొరటోపీని బోర్లించి ఆ వస్తువుల్ని దేన్నీ ముట్టుకోకుండా ఆ ఉంగరాన్ని బయటకు తీయాలి అన్నాడు.

మా కిష్టిగాడు చటుక్కున స్టేజి యెక్కి "నేను అలాతీస్తా"నని మాంత్రికుడి చేతిలోని ఎముకతో ఆ టోపీ చుట్టూ మూడుసార్లు గీచి "ఓం, ఫ్రీం, ఢాం. టాంఫత్" అని మూడుసార్లు కళ్ళుమూసుకుని అన్నాడు. తరువాత కళ్ళుతెరచి "టోపీక్రింది ఉంగరం మాయమైపోయింది. టోపీని తియ్యవచ్చు"నన్నాడు. ఎంత నిజమో చూద్దామనుకుని మాంత్రికుడు టోపీనితీశాడు. ఉంగరం అక్కడే వుంది. వెంటనే కిష్టిగాడు ఆ ఉంగరాన్ని తనచేతిలోకి తీసుకుని టోపీని, బల్లను ముట్టుకోకుండా ఉంగరాన్ని నాచేతిలోకి తెప్పించాను" అన్నాడు విజయంతో. అతని యుక్తికి అందరు ఆశ్చర్యపోయారు.

సబ్నివీసు శ్రీనివాసరావు

నత్తిదోషము

మా పోలీసు సూపరిండెంటు దొరగారు పాడేరు మకాంవేసారు. ఏజన్సీ క్యాంపు అధమం పది రోజులైన పడుతుంది. అందుచే రోజు టపాలు ప్రతి రోజు క్యాంపుకు పంపమని ఉత్తరువు చేసారు మా మేనేజరుగారికి. టపాలు అందుకొని చూచినతరువాత "రి-రి-రి-రి యూడర్" అని పిలిచేవారు. మాదొరగారికి నత్తిలెండి.

ఒకరోజున నెం॥ 377 రు కాని స్టేబిలు పట్టణమునుండి డాకుపట్టు కొచ్చి దొరగారివద్ద హాజరైనాడు.

దొరగారు అడిగారు

"క-క-క-క-ఖ్యాహై"

కానిస్టేబిలు—

"హు-హు-హు-హుజూర్ డ-డ-డ-డాక్‌హై"

దొరగారుగ్రుడ్డయి — "బ-బ-బ-బ-బ-బద్మాస్"

"హు-హు-హు-హుజూర్....."

"ష-ష-ష షటఫ్. రి-రి-రి-రి-రి ఈడర్ ది-ది-ది-దిస్ క-క-క-క-కాని స్టేబిల్ ఇజ్ స-స-స-స సస్పెండెడ్"

తరువాత తెలిసిందిగదా ఆ జవాను కూడ నత్తివాడేనని, మేనేజరుగారే అతనిని డాకుడ్యూటీవేసారని. జరిగినసంగతంతా ఆఫీసులో విని అంతా నవ్వుకున్నారు. దొరగార్ని నచ్చచెప్పి జవానును తిరిగి పనిలో ప్రవేశపెట్టారు.

డి. పి. కామేశ్వర్

తుమ్ము ఫలితం

"అరే! భాయ్! బలే పిల్లరా!"

"ఆహా! లేడిపిల్లలా వుందే!"

"కాదురా!...సుందరాంగి!"

"పోరా!...కెందమ్మి పూ మొగ్గలా వుంటేను"

"అరే! సెంటువాసనలు...గుమ్మంటున్నాయ్‌రా"

"ఆహా! మనోరంజన్‌లా వుందే"

"కాదురా! భాయ్...నైట్‌క్వీన్"

"కొంగుతాకితే బంగారం రాలేలా వుందే"

"అరరే! ముఖం త్రిప్పకుండా వుందిరా"

"ముఖం త్రిప్పితే! ముత్యాలు రాలిపోతాయేమో"

"ఒరే! ఎలాగైనా చూచితీరాలరా"

"ఏమిట్రోయ్"

"ఆమె ముఖంరా"

"ఏం?...ముఖంచూచైనా..."

"అరరే! మా అక్కయ్యరా..."

"ఎంత పని చేసాంరా"

"లైట్లు వేసేవరకూ గుర్తుపట్టలేకపోయానే"

"ఛా! ఇవాళ మనం సినిమాకి బయల్దేరినవేళ బాగులేదురా! బయల్దేరే ముందే ఎవరో టుసుక్కుమని తుమ్మేసేరు. ఆ తుమ్ము ఫలితమే ఇది!"

"రమణ్"